క్లుప్తంగా

నేడు ఆర్డీవో కార్యాలయంలో 'స్పందన'

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డిఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి



నందిగామ: రౌడీ షీటర్లలో మార్పు వస్తే షీట్ తొలగించడానికి అవకాశం ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. రౌడీ షీటర్లలో మార్పు వస్తే రౌడీ షీట్ తొలగించే అవకాశం కూడా ఉందన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉంటుందని గుర్తు చేశారు. అనవసరంగా వివాదాలకు పోయి జైలు పాలు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పండుదొర, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి దాతల వితరణ



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపమ్మవారి ఆలయానికి ఆదివారం పలువురు భక్తులు ఆలయ ఈఓ తిరుమలేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు చేతుల మీదుగా విరాళాలు అందజేశారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన నగేష్‌బాబు రూ.5,116, గుంటూరుకు చెందిన కాసాని వెంకట శివారెడ్డి రూ.10,116, గంపలగూడెం మండలం కొణిజర్లకు చెందిన నంబూరు కృష్ణమూర్తి రూ.8,500, ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన తూములూరు ఉపేంద్రరావు రూ.9,116 అన్నదానానికి విరాళాలు అందజేశారు. గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన టి. రామకృష్ణ గోశాలలో గోవుల సంరక్షణకు రూ.10,016 అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలతో సత్కరించారు.

200 మందికి వైద్య సేవలు



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జీఆర్‌సీ కళాశాలలో జగ్గయ్యపేట నియోజకవర్గ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. ఆదివారం ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యపరమైన సమస్యలను ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స తీసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చు అన్నారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, డెంటల్, కార్డియాక్, గైనిక్, జనరల్ వైద్య నిపుణులు పాల్గొన్నారు. డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాచేపల్లి శ్రీనివాస్, కోశాధికారి డోకుపర్తి రమేష్, సభ్యులు అప్పన మురళీకృష్ణ, విజయ్, స్వామి దిలీఫ్, మల్లికార్జున, ధర్మారావు,అశోక్, దాచేపల్లి వీరభద్రరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఉషారాణి అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ప్రభుత్వాస్పత్రి సిబ్బంది రక్తదానం చేశారు. ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌లోని శిబిరంలో ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీ సిబ్బంది 23 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. మనం చేసే రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు నిలుపుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరంజిత, డీపీఎం కిరణ్, కౌన్సిలర్ జోస్పిన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): గాంధీ జయంతి సందర్భంగా సోమవారం మాంసం, చేపలు మార్కెట్‌లకు విక్రయాలు బంద్ ప్రకటించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని కబేళా కూడా మూసేస్తామని, ఎవరైనా నిబంధనలను పాటించకుండా షాపులు తీసి వ్యాపారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాడవాడలా స్వచ్ఛతా హీ సేవ



పెనుగంచిప్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో శ్రమదానం చేస్తున్న వర్కర్లు, ఆయాలు



రహదారిని శుభ్రం చేస్తున్న సర్పంచ్ పరమయ్య, తదితరులు

పెనుగంచిప్రోలు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనిగండ్లపాడు గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.జలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి) : నివాసప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని సర్పంచ్ వడ్డే పరమయ్య సూచించారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులను గ్రామస్తులతో కలిసి శుభ్రం చేశారు. వత్సవాయి, మక్కపేట, మంగొల్లు, భీమవరం గ్రామాల్లో గ్రామస్తులతో కలిసి ప్రధాన కూడళ్లను శుభ్రం చేశారు. సర్పంచ్ భూక్యా సీతమ్మ, గుడేటి శారమ్మ, అన్నెపాక ప్రణీత, భీమాల సుజాత, కొట్టె నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీసేవ కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అరుణకుమారి ఆధ్వర్యంలో గ్రామస్తులు గ్రామంలోని పలు వీధులను శుభ్రం చేశారు. శ్రమదానం చేయడం వలన కలిగే ప్రయోజనాలను సర్పంచ్ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరమాచినేని నాగమల్లేశ్వరరావు, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: ప్రధాని నరేంద్ర మోడి పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ



రామిరెడ్డిపల్లి గ్రామంలో వీధులు శుభ్రం చేస్తున్న గ్రామస్తుల

బస్టాండ్ వెనుక ఉన్న బుద్ధుని విగ్రహం రోడ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మన్నె శ్రీనివాసరావు, నాయకులు గోలి రాఘవేంద్రరావు, అన్నెపాగ శ్రీనివాసరావు, అన్నెపాగ శ్రీకాంత్, సైదాబాబు, పెనుగొండ రామకృష్ణ, వేద సుబ్రహ్మణ్యం, యర్రమాసు రఘు, పసుపులేటి శ్రీకృష్ణ, పొన్న ప్రభాకర్ పాల్గొన్నారు.

●మహాత్మా..మన్నించు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా నందిగామ పట్టణంలో గాంధీ సెంటర్ సుందరీకరణ పనులు చేపట్టారు. రహదారి విస్తరణ పనుల నిమిత్తం జాతీయ, రాజకీయ నాయకుల పాత విగ్రహాలను తొలగించి, కొత్తవి క్రమ పద్ధతిలో అమర్చేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశాలతో ఆ పార్టీ నాయకులు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావటంతో పనులు ఆగిపోయాయి. కోర్టు విధించిన స్టే గడువు ముగియటంతో దాదాపు 17 నెలల తరువాత పనులను మళ్లీ ప్రారంభించి గాంధీ సెంటరులో గాంధీ విగ్రహంతో పాటు జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మరోసారి టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించి గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించకుండా అడ్డుకున్నారు.

–నందిగామ టౌన్



నందిగామ గాంధీ సెంటరులో ఏర్పాటు చేసిన నట్ అండ్ బోల్ట్ గాంధీ విగ్రహం

మహనీయుల త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తి



నూతనంగా ఆవిష్కరించిన అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

పోలంపల్లి (వత్సవాయి): మహనీయుల త్యాగాలను భావితరాలకు గుర్తుచేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, జాతీయ నాయకుడు మున్నంగి నాగరాజులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను దేశ నాయకుడిగా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. నేడు ఆయన రాసిన రాజ్యాంగం ప్రకారమే పాలన సాగుతుందన్నారు. కేవలం విగ్రహాలను పెట్టడమే కాకండా వారు చూపిన బాటలో అందరూ నడిచేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాడుగుల లాజర్, విగ్రహదాతలు మాడుగుల సురేష్, రవి, కమిటీ సభ్యులు దారెల్లి నాగేశ్వరరావు, ఆర్ వెంకటి, పాము ఏసోబు, ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీను, జి. దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

73 శాతం పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని 19 సచివాలయాల్లో ఆదివారం వివిధ రకాల పింఛన్లను 73 శాతం మంది లబ్ధిదారులకు అందజేసినట్లు ఎంపీడీవో రమేష్‌బాబు ఆదివారం పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారన్నారు. సెలవు దినమైనప్పటికీ ఆయా గ్రామాల్లో సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా అందిస్తామన్నారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష

జగ్గయ్యపేట: మండలంలోని బండిపాలెం గ్రామంలో ఈ నెల 3న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు ఆదివారం పేర్కొన్నారు. గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణం

విజయవాడ కల్చరల్: కవి జాషువా సాహిత్యం సామాజిక అంశాలకు దర్పణంగా భావించవచ్చని జాషువా కళాపరిషత్ వ్యవస్థాపకుడు పెద్దీటియోహాన్ అన్నారు. పద్మభూషణ్ జాషువా కళాపరిషత్ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం గుర్రం జాషువా 128 జయంతి వేడుకలు, కవి సమ్మేళనం, గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. యోహాన్ మాట్లాడుతూ జాషువా కవిత్వ వేదనాభరతమై సందేశాత్మకంగా సాగుతుందన్నారు. కళాపరిషత్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గద్దం విజయరావు మాట్లాడుతూ జాషువా కవిత్వానికి ఎల్లలు లేవని తెలిపారు. కవయిత్రి డాక్టర్ సాంబేలు శాంతిబాయ్ మాట్లాడుతూ నేటి యువ కవులు ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. సంపాదకుడు కలిమిశ్రీ, కవులు సిరికొండ నరసింహరాజు, శిఖా ఆకాష్, డాక్టర్ రంగిశెట్టి రమేష్ ప్రసంగించారు. అస్మతున్నీసా రచించిన అస్మదీయం, అనంత ఆకాశం, దాసరి ఆదినారాయణ రచించిన అనంత ఎర్ర సితార కవితా సంపుటాలను ఆవిష్కరించారు. దాసన్నగారి కృష్ణమూర్తి, డాక్టర్ సాంబేలు శాంతిబాయ్‌లకు జాషువా విశిష్ట పురస్కారాలను, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కవులకు జాషువా పురస్కారాలను అందించారు. కవులు స్వీయకవితాగానం చేశారు.



అస్మదీయం, అనంత ఆకాశంలో కవితా సంపుటిలను ఆవిష్కరిస్తున్న అతిథులు

విద్యార్థులకు డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విద్యార్థులకు గాంధీ చిత్రాలు గీయడంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. సీనియర్స్ విభాగంలో గాంధీ జీవితంలో ముఖ్య సంఘటనలు– ఉద్యమాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలకు విద్యార్థుల నుంచి చక్కని స్పందన లభించిందని గ్రంథాలయాధికారి రమాదేవి తెలిపారు. సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విజేతలకు గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటల గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, కుమార్, ఫణి బాబు, దుర్గాంబ, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు విశ్వకర్మ యోజన

గుణదల (విజయవాడ తూర్పు): చేతి వృత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం బీసీ సమన్వయకర్త తాటికొండ రంగబాబు అన్నారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ యోజనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ చేతివృత్తిదారుల అభ్యున్నతికి విశ్వకర్మ యోజన తోడ్పడుతుందన్నారు. దీనిలో భాగంగా ఆయా వృత్తుల వారికి ప్రత్యేక శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో ఖర్చుల నిమిత్తం రూ.500 ఇస్తారని పేర్కొన్నారు. దీనికి ముందు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని వివరించారు. శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్‌లు అందిస్తారని తెలిపారు. దీనిద్వారా బ్యాంక్‌లు రుణాలు మంజూరు చేస్తాయని, చేతివృత్తిదారుల ఆర్థిక అభివృద్ధికి చేయూత లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతాలను తెరిచే వారికి అప్లికేషన్లు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ క్రెడిట్ చీఫ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, పటమట, మొగల్రాజపురం, ఆటోనగర్‌కు చెందిన చేతివృత్తిదారులు పాల్గొన్నారు.



బ్యాంక్ అకౌంట్ దరఖాస్తులు అందజేస్తున్న బ్యాంక్ సిబ్బంది

నవరస నటుడు అక్కినేని

విజయవాడ కల్చరల్: నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని స్వరలయ సంగీత సంస్థ నిర్వాహకుడు ఆర్.ప్రభాకర్ అన్నారు. స్వరలయ సంస్థ ఆదివారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని స్వయం ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని అత్యున్నతమైన దాదాసాహెబ్ పురస్కారం లభించినట్లు తెలిపారు. గాయనీ గాయకులు బాల పృథ్వీరాజ్, రాజ్, రేవతి, భారతి, నాగమణి, వైఎస్ రామకృష్ణ.. అక్కినేని నటించిన 40 చిత్రాల్లోని పాటలు ఆలపించారు. నిర్వాహకులు అక్కినేని చిత్రపటానికి నివాళి సమర్పించారు.



భక్తులకు అన్నప్రసాద వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): లయన్స్ క్లబ్ విజయవాడ సుప్రీమ్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ఏడాది క్లబ్ రిలీవింగ్ హంగర్ కార్యక్రమానికి గుర్తింపు పొందిన డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ అప్పన వెంకట సత్యసాయిబాబు సహకారంతో పశ్చిమ నియోజకవర్గ పరిధిలో అమ్మవారి అన్న ప్రసాదాన్ని అందజేశారు. ముఖ్యఅతిథి 2022 జిల్లా కోశాధికారి పొట్టి ముత్యపు ప్రభాకరరావు హాజరై భక్తులకు భోజనం వడ్డించారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆకలిదప్పులను తీర్చటం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు.

ఘనంగా వినాయకుడి విగ్రహ నిమజ్జనోత్సవం



వినాయక నిమజ్జన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పెనుగంచిప్రోలులో గణనాథుని ఊరేగింపు

కంచికచర్ల(వీరులపాడు): వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి మహోత్సవ కార్యక్రమాల మాదిరిగానే నిమజ్జన కార్యక్రమాలను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పరిటాల గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పండుగ జరుపుకోవటం అభినందనీయమన్నారు. నిమజ్జన కార్యక్రమాలలో అపశ్రుతులు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్త శ్రీనివాసరావు, నన్నపనేని నరసింహారావు, చింతా రవీంద్రనాథ్, వేమా సురేష్‌బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం గ్రామంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలతో పాటు మండలంలో పలు ప్రాంతాల్లో, ఆలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు తీన్‌మార్ డప్పులు, బాణసంచా మెరుపుల మధ్య జరిగాయి. ఊరేగింపుల అనంతరం విగ్రహాలను స్థానిక మునేరులో, కాలువల్లో నిమజ్జనం చేశారు.

కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన

జుజ్జూరు(వీరులపాడు): గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని బీసీ కాలనీలో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులకు షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగంతో కలిసి ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా కల్వర్టు లేకపోవటంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సంబంధిత అధికారులతో చర్చించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, మాజీ సర్పంచ్ సైదా, నాయకులు పూలా పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, తదితరులు

సీసీ రోడ్డు పనులకు..

కంచికచర్ల(వీరులపాడు): రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని అంతర్గత రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామని ఎంపీపీ మలక్ బషీర్ పేర్కొన్నారు. కంచికచర్ల మండలంలోని పెండ్యాల గ్రామంలోని యాదవ బజార్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్య మూలాలు తెలుసుకుని అందుకనుగుణంగా ముందుకు సాగటంతో పాటు సమస్యను పరిష్కరించి రోడ్డు పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రాధాన్యతాక్రమంలో అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు బడే హజరత్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఫయాం పాషా, గౌస్, ఆదినారాయణ, షేక్ పీరాసాహెబ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రముఖుల ప్రత్యేక పూజలు



ఆలయంలో ఆశీర్వచనం తీసుకుంటున్న జీఎస్టీ కమిషనర్‌తో ఆలయ ఈఓ, చైర్మన్



ఆశీర్వచనం తీసుకుంటున్న నందిగామ సెషన్స్ ప్రిన్సిపల్ జడ్జి తిరుమలరావు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ప్రకాశం, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జీఎస్టీ కమిషనర్ సాదు నరసింహారెడ్డి, నందిగామ సెషన్స్ ప్రిన్సిపల్ జడ్జి తిరుమలరావు, కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పోనుకోలు నీరజ ఉన్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం వీరిని ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.రమేష్ నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఆశీర్వచనం తీసుకుంటున్న కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

ఓటు హక్కు వినియోగించుకోవాలి

పెనమలూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా విలువైందని ప్రతి ఒక్కరు రాజ్యాంగపరంగా సంక్రమించిన ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని ఆర్డీవో విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 80 సంవత్సరాలు నిండిన ఓటర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తామని చెప్పారు. ప్రజలు వారి ఓటు ద్వారానే కోరుకున్న వ్యక్తులను ఎన్నుకోవచ్చని పేర్కొన్నారు. ఓటు హక్కు ద్వారానే ఉత్తమ పాలన అందించే పాలకులను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఓటు లేని వారు వెంటనే ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



వృద్ధ ఓటర్లను సన్మానించిన ఆర్డీఓ విజయ్‌కుమార్

వీఎంసీ కార్యాలయాల్లో నేటి స్పందన రద్దు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని రద్దు చేశామని, మళ్లీ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.